వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు సామర్లకోటలో హాల్ట్ ఇవ్వండి

విశాలాంధ్ర - కాకినాడ : విశాఖపట్నం నుండి సికింద్రాబాద్ వెళ్లే వందే భారత్ సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్‌కు గతంలో సామర్లకోటలో హాల్టు ఉండేదని, మూడవ తేదీ నుండి ఇక్కడ హాల్టు ఎత్తివేసారని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు జిల్లా కార్యదర్శి, సహాయ కార్యదర్శి కె బోడకొండ, తోకల ప్రసాద్‌లు ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. వందే భారత్ ఎక్స్ ప్రెస్ పెట్టినప్పుడు ఆనాడు సామర్లకోటకు హాల్టు ఇవ్వలేదని ఆనాడు కాకినాడ ఎంపీగా ఉన్న వంగా గీత ఆమె చొరవతో ఢిల్లీలో రైల్వే మంత్రి రైల్వే ఉన్నతి అధికారులతో మాట్లాడి కాకినాడ జిల్లా ప్రజల అవసరాల కోసం ముఖ్యంగా విద్యార్థులు చిన్నచిన్న వ్యాపారస్తులు చాలామంది తరచూ హైదరాబాద్‌కు వెళ్తారని కాకినాడ పోర్టు అవసరాలు రీత్యా సామర్లకోటలో హాల్టు ఇవ్వాలని వంగ గీత చేసిన కృషి ఫలితంగా ఆనాటి నుండి ఈనెల 2వ తేదీ వరకు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సామర్లకోటలో హాల్టు ఉందని వారు గుర్తు చేశారు. ఆనాడు ఇచ్చిన జీవో నేటితో ముగిసింది కావున కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాస్ చొరవ చూపించి రైల్వే ఉన్నత అధికారులతో మాట్లాడి మూడో తేదీ నుండి సామర్లకోటలో హాల్టు ఇప్పించవలసిందిగా భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ కోరుతుందని వారు తెలిపారు.

పడిపోయిన పర్సు అందజేత

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరం మండలం ఠాణేలంక పెద్ద పేట గ్రామానికి చెందిన నాతి నాగేశ్వరరావు పని నిమిత్తం కాకినాడ బయల్దేరి వెళ్ళగా యానం మధ్య మార్గంలో పర్సు పడిపోయింది. ఇంటికి వచ్చి ప్యాంటు పాకెట్ చూడగా పర్సు పడిపోయింది. కాకినాడ పిఎంజె బంగారం జువెలర్స్‌లో పనిచేస్తున్న ఐ పోలవరం మండలం కేశనకుర్రు గ్రామానికి చెందిన విత్తనాల సురేష్‌కు ఆ పర్సు దొరికింది. దీంతో అతను ఆ పర్సును నాగేశ్వరరావు ఇంటికి వచ్చి అందజేశాడు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ మనుషుల్లో మానవత్వం, మంచి ఇంకా ఉంది అనడానికి ఈ సంఘటన ఉదాహరణ అని, పర్సును అందజేసిన సురేష్‌కు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.

విను రెడ్డికి భీష్మ, వశిష్ట పురస్కారం

విశాలాంధ్ర - పెదపూడి/అనపర్తి : సామాజిక సేవా రంగంలో సోషల్ మీడియా ద్వారా విశేష సేవలు అందిస్తున్న విను రెడ్డికి భీష్మ, వశిష్ట పురస్కార్ అవార్డు లభించింది. వివిధ రంగాల్లో సేవలు చేసే వ్యక్తులకు వందే భారత్ సంస్థ అందించే పురస్కారాల్లో భాగంగా అనపర్తికి చెందిన విను రెడ్డికి ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా విను రెడ్డి మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం, కేఎల్ యూనివర్సిటీ ఇంటర్నేషనల్ సోషల్ మీడియా అవార్డు అందజేసినట్టు తెలిపారు. తన నిస్వార్థ సేవలను గుర్తించి భీష్మ, వశిష్ట పురస్కార్ అవార్డు అందించడం ఆనందంగా ఉందని, శనివారం కాకినాడ కుసుమ సత్య ఫంక్షన్ హాల్‌లో జరిగే ఫోటో ఫినా ఎక్స్‌పోలో ఈ పురస్కారం అందుకున్నారు.

ఆదిత్య యూనివర్సిటీకి పురస్కారం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఇండియా హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్ 2024-2025 సంవత్స రానికి గాను ఎడ్యుకేషన్ వరల్డ్ నుండి తమ ఆదిత్య యూనివర్సిటీకి గ్రాండ్ జ్యూరీ డైవర్సిటీ, ఇంక్లూసన్ ఈక్విటీ పురస్కారం లభించినట్లు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ అవార్డు స్వీకరించడం పట్ల ఆనందంగా ఉందని ఈ అవార్డు ద్వారా తమ సంస్థకు గౌరవంతో పాటుగా మరింత బాధ్యత పెరిగిందని ఆయన అన్నారు. ఈ గుర్తింపు మరింత సమగ్రమైన, సమానమైన విద్యా వాతావరణాన్ని నిర్మించడంలో మా ప్రయత్నాలను మరింత ముందుకు తీసుకెళ్లడానికి మాకు స్ఫూర్తి నిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రో-వైస్ ఛాన్సలర్(అకాడెమిక్స్) డాక్టర్ ఎస్. రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి. సురేష్, డీన్-ఐ క్యూ ఎ సి డాక్టర్ జి. రామకృష్ణ పాల్గొన్నారు.

కోరుమిల్లిలో ప్రత్యేక గ్రామ సభ

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లి గ్రామ పంచాయతీ వద్ద ప్రత్యేక గ్రామ సభ సర్పంచ్ ఆచంట సత్య నారాయణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహిం చారు. ఎన్‌డిఏ కూటమి అభ్యర్థిగా ఎన్నికైన మండపేట శాసనసభ్యులు వేగుళ్ల జోగేశ్వరరావు గ్రామ అభివృద్ధికి 60 లక్షలు మంజూరు చేయించారు. గ్రామ సభ ద్వారా ముందుగా అధ్వానంగా వున్న రహదారులు, డ్రైనేజీలు గుర్తించి అభివృద్ధి చేయుటకు ఆమోదించారు. ఎమ్‌ఎల్‌ఏ వేగుళ్ల అభీష్టం మేరకు డ్రైనేజీల అభివృద్ధికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తామని సర్పంచ్ ఆచంట సత్య నారాయణ ఈ గ్రామ సభలో పేర్కొన్నారు. ఎంపిటిసి సుంకర వెంకటేశ్వర రావు, వైస్ ప్రెసిడెంట్ ఎస్. పద్మ, జనసేనమండల అధ్యక్షులు తుట్టుపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నది కోతకు గురవుతున్న ప్రదేశాల పరిశీలన

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు బుచ్చిబాబు నది కోతకు గురవు తున్న గ్రామాల పర్యటనలో భాగంగా పల్లవారిపాలెం వివేకా నంద వారధి, కూనలంక, లంకా ఆఫ్ ఠాణేలంక, సలాదివారి పాలెం గ్రామాలలో నదికోతకు గురవు తున్న ప్రదేశాలను అధికారులతో కలిసి పరిశీలిం చారు. రక్షణ చర్యలకు సంబంధించి రాయి కట్టుబడికి అంచనాలను రూపొందించి వెంటనే సమర్పించాల్సిందిగా జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి న్యాయవాదులు నుంచి మంచి స్పందన లభించింది. కాకినాడకు చెందిన క్లోవే డెంటల్ హాస్పిటల్, డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ సంయుక్తంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి కాకినాడ బార్ అసోసి యేషన్ భవనములో ఈ శిబిరం జరిగింది. న్యాయవాదులందరూ కంటి పరీక్షలు, దంత పరీక్షలు చేయించుకుని తగిన సలహాలు పొందారు. కంటికి వివిధ పరీక్షలు నిర్వహించి సలహాలు సూచనలు అందజేశారు. పంటి సమస్యలను న్యాయవాదులు ఈ శిబిరంలో పాల్గొని దంత పరీక్షలు పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి కళ్ళజోళ్లను అందుబాటులో ఉంచారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ నరహరిశెట్టి రవికృష్ణ, అధ్యక్ష, కార్యదర్శులు ముత్తింటి విశ్వేశ్వర రావు, చెక్క శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కేవీ భద్రరావు, స్పోర్ట్స్ అండ్ కల్చర్ సెక్రెటరీ అశోక్, ట్రెజరర్ బహదూర్ షా, సభ్యురాలు ఉద్దండ ఉమా గౌరీ దగ్గరుండి న్యాయవాదులు అందరికీ పరీక్షలు చేయించారు.

కాకినాడ జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు

విశాలాంధ్ర - కాకినాడ : గత 15 రోజులుగా కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఉత్తర్వులు ప్రకారము కాకినాడ జిల్లాలో, రోడ్ యాక్సిడెంట్లను తగ్గించాలన్న ఉద్దేశంతో, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా, కాకినాడ జిల్లా పోలీస్ వారు గత పదిహేను రోజులుగా ప్రత్యేక బృందాలతో తనిఖీలు, ఆకస్మిక దాడులు చేపట్టి, వాహన తనిఖీలు చేబట్టి మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న అనేక మందిని అరెస్టు చేసి కేసులు నమోదు చేసినారు. ప్రత్యేక బృందాలుతో దాడులు నిర్వహించి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిని పెద్ద ఎత్తున అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా వారికి కోర్టులో జరిమానా విధించారు.

నష్ట పరిహారాల అంచనా గణన త్వరగా పూర్తిచేయాలి

కలెక్టర్ మహేష్ కుమార్

విశాలాంధ్ర - కాకినాడ : గోదావరి వరదల మూలంగా నష్టపోయిన వ్యవసాయ, ఉద్యాన పంటల నష్ట పరిహారాల అంచనా గణనను ఈనెల నాలుగో తేదీ లోపు పూర్తి చేసి సోషల్ ఆడిట్ నిమిత్తం రైతు సేవా కేంద్రాలను ప్రదర్శించి గ్రీవెన్స్‌లను రైతుల నుండి సేకరిస్తూ సమగ్రమైన నివేదికను ఈనెల 10వ తేదీ నాటికి జిల్లా యంత్రాంగానికి సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుండి మండల స్థాయి వరకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గోదావరి వరదలు అనంతరం ముంపు ప్రభావిత ఆవాసాలలో చేపట్టాల్సిన పారిశుద్ధ్యం, వైద్య సేవలు, సురక్షిత త్రాగునీరు సరఫరా, డ్రైనేజీలలో ఉన్న మురుగు నీరును అవుట్ ఫాల్స్ స్లూయిజ్ గేట్లు తెరిచి దిగువకు విడుదల చేయడం, వ్యవసాయ ఉద్యాన పంట నష్టాల గణన అంశాలపై మండల స్థాయి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరద అనంతరం ఏటిగట్లు పటిష్టత, అవుట్ పాల్ స్లూయస్ గేట్ల మరమ్మతులు తదితర పనులకు సంబంధించి శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టేందుకై అంచనాలు రూపొందించి సమర్పించాలన్నారు. వరద పరిస్థితులను ఎదుర్కొన్న తర్వాత ప్రస్తుతం చివరి ప్రమాద హెచ్చరికను కూడా ఉపసంహరించుకోవడం జరిగిందని, ముంపు ప్రభావిత ఆవాసాలలో పారిశుద్ధ్య ప్రక్రియను సమగ్రంగా నిర్వహిస్తూ బురద చేరిన ప్రాంతాలలోని బురదను తొలగించి బ్లీచింగ్ చేస్తూ అంటువ్యాధులు ప్రబలకుండా క్రిమి కీటకాలు వ్యాప్తికి ఆస్కారం లేకుండా క్రిమిసంహారక ద్రావణాన్ని పిచికారి చేస్తూ సాయంత్రం వేళలో ఫాగింగ్ చేపడుతూ దోమల వ్యాప్తిని నివారించాలని సూచించారు. గ్రామపంచాయతీ సిబ్బంది ఎంపీడీవోలు పారిశుద్ధ్యం పై ప్రత్యేక ఫోకస్ పెట్టాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ముంపు బాధి తుల ఆరోగ్య భద్రతకై చర్యలు చేపట్టడంతో పాటుగా నీటి ద్వారా సంక్రమించే డయేరియా జ్వరాలు, తదితర వ్యాధుల పట్ల అప్రమ త్తంగా వ్యవహరిస్తూ సకాలంలో అవసరమైన ఔషధాలు అందించి అనారోగ్య పరిస్థితులను పూర్తిగా చక్కదిద్దాలని ఆదేశించారు. పాము కాటు నివారణ ఔషధాలను సాధారణ ఔషధాలను అందు బాటులో ఉంచుకోవాలన్నారు. జలవనరులు డ్రైనేజీ విభాగపు ఇంజనీర్లు డ్రైనేజీలలో ఉన్న మురుగునీరును అవుట్ ఫాల్స్ స్లూయిస్ ద్వారా దిగువకు విడుదల చేయాలన్నారు. పంట కాలువలలో అవసరాలకు అనుగు ణంగా సాగునీటిని విడుదల చేయా లన్నారు. వ్యవసాయ శాఖ వారు పంట నష్టాల గణన మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్దేశిత ప్రొఫార్మాలో పంట నష్టాలను గణించి ఆయొక్క నివేదికను రైతు సేవా కేంద్రాలలో ప్రదర్శిస్తూ ఇంకా ఎవరైనా రైతులు మిగిలి ఉంటే లేదా వారి వద్ద నుండి గ్రీవెన్స్‌లు వస్తే వాటిని కూడా పరిశీలించి సమగ్రమైన నివేదికను రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిషాంతి, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేడు ఉపకరణాల మంజూరు గుర్తింపు శిబిరం

విశాలాంధ్ర - గండేపల్లి : కాకినాడ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఏఎల్ఐఎంసిఓ సంస్థ సహకారంతో దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ జరుగుతుందని కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ దివ్యాంగుల అధ్యక్షులు మండపాక అప్పన్నదొర తెలియజేశారు. జగ్గంపేట నియోజకవర్గంలో శాసన సభ్యులు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభా వంతులకు సహాయ ఉపకరణముల కొరకు గుర్తింపు శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 3వతేదీ ఉదయం 9 గంటలకు జగ్గంపేట ఎంపీడీవో కార్యాలయం వద్ద శిబిరం నిర్వహిస్తామన్నారు. అర్హులకు మూడు చక్రంల సైకిల్, వీల్ చైర్స్, చంక కర్రలు, కృత్రిమ కాళ్లు, కాలిపర్స్, రోలేటర్స్, చెవి మిషన్లు, వాకింగ్ స్టిక్స్, లెప్రసీ సోకినవారికి ఏడిఎల్ కిట్స్, సిపి చైర్ బ్యాటరీ ఆపరేటేడ్ మూడు చక్రాల సైకిలు వంటి ఉపకరణముల గుర్తింపు నమోదు జరుగుతుందన్నారు. అర్హులు సదరము ధ్రువీకరణ పత్రము. రేషన్ కార్డు. ఆధార్ కార్డు, యుడిఐడి కార్డులతో హాజరు కావాలన్నారు. లబ్ధిదారుల వైకల్య పరిస్థితిని బట్టి ఉపకరణాల ఏర్పాటు మంజూరు జరుగుతుందన్నారు. అర్హులైన వారు శిబిరానికి శనివారం ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కాకినాడ జిల్లా దివ్యాంగుల అధ్యక్షులు మండపాక అప్పన్న దొర తెలిపారు.

అనుబంధాలు, ఆప్యాయతలతో మెలగాలి

విశాలాంధ్ర - రాజానగరం : ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరు వ్యక్తిగతంగా బిజీబిజీగా గడుపుతున్నారని, ఆ విధానాలకు స్వస్తి పలికి శిక్షణ పొందిన ప్రతిఒక్కరు తమ తోటి వారి పట్ల అనుబంధాలు ఆప్యాయ తలతో మెలగాలని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు అన్నారు. కాకినాడ పార్లమెంటు పరిధిలోని జగ్గంపేట మండలం కాండ్రిగల గ్రామంలో ఇటీవలే సుంకర ఫౌండేషన్ అందించిన ఉచిత మగ్గం శిక్షణ తరగతులు ముగిశాయి. దీంతో రాజానగరం మండలం దివాన్ చెరువు గ్రామంలోని సుంకర ఫౌండేషన్ కార్యాలయం వద్ద శిక్షణ పూర్తి చేసుకున్న సుమారు 70 మంది మహిళలకు ఫౌండేషన్ అధినేత చేతులు మీదుగా ధ్రువ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీలు సుంకర నాగేశ్వరరావు, వీరాస్వామి, శిక్షకురాలు అల్లంపల్లి రూప,సభ్యులు కోసూరి మీనా, జంగిలి కుమారి,కిరణ్ సౌమ్య, నాగమణి, పాల్గొన్నారు.

తెలుగువారి ఖ్యాతి చాటిన మహనీయులు పింగళి

విశాలాంధ్ర - రాజానగరం : తెలుగువారి ఖ్యాతిని దేశానికి చాటిచెప్పిన మహనీయులు పింగళి వెంకయ్య అని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వై. శ్రీనివాసరావు కొని యాడారు. జాతీయ పతాక రూపకర్త స్వతంత్ర సమరయోధుడు పింగళి వెంకయ్య 148వ జయంతి పురస్కరించుకొని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో పింగళి వెంకయ్య జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ పింగళి వెంకయ్య వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకొని విశ్వవిద్యాలయంలోని సిబ్బంది అంత తమ విధులను తాము త్రికరణ శుద్ధిగా నిర్వహిస్తూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి. సుధాకర్, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ హైస్కూల్ సందర్శించిన మంత్రి సుభాష్

విశాలాంధ్ర - కాజులూరు : కాజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ సందర్శించి ఆహ్లాదకర వాతావరణాన్ని, పచ్చ దనాన్ని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ సాధించిన విద్యార్థులను అభినం దించారు. గత సంవత్సరం పదవతరగతి ఫలితాలు అడిగి తెలుసుకుని దాదాపు 96 శాతం ఉత్తీర్ణత సాధించడం అంతేగాకుండా 35 మందికి పైగా 500 మార్కులు పైబడి సాధించినందుకు ప్రధానోపాధ్యాయులు పంపన కృష్ణమూర్తిని, ఉపాధ్యా యినీ, ఉపాధ్యాయులను అభినందించారు.

పాఠశాలలో జరుగు వేడుకలలో 500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తానంటూ విద్యార్థులను ప్రోత్సహించారు. అనంతరం ప్రధానమంత్రి ప్రారంభించిన మాకే నామ్ పర్ ఏక్ పేడ్ (అమ్మ పేరుతో ఒక చెట్టు) కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో ఒక మొక్క నాటారు. పాఠశాలలో జరిగిన అభివృద్ధిలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు భాగస్వామ్యాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన దాత, కూటమి నాయకులు అన్యం రాము, మాజీ ఎంపి పి యాళ్ల కృష్ణారావు, యాళ్ల రవి, జనసేన, బిజెపి కూటమి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను ఉద్యోగులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర - జగ్గంపేట : రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు అన్నారు. జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా స్థానిక కాపు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఉచిత డిఎస్సీ, టెట్ కోచింగ్ సెంటర్‌ను జిల్లా కలెక్టరు షాన్ మోహన్ సగిలి శుక్రవారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా విచ్చేసిన యనమల మాట్లాడుతూ కోచింగ్ సెంటర్ నిర్వహణ చాలా కష్టతరమైన కార్యక్రమమని అభిప్రాయపడ్డారు. జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా ఇచ్చే ఉచిత కోచింగ్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని, కోచింగ్ తీసుకునే వారందరూ ఉద్యోగం పొందేలా తయారుకావాలన్నారు. ఉపాధ్యాయ వృత్తి సమాజాన్ని తీర్చిదిద్దే వృత్తి అన్నారు. జిల్లా కలెక్టరు మాట్లాడుతూ అందరు అన్ని ఉద్యోగాల్లో సెలెక్ట్ కాలేరని, సమయం వృధా చేయకుండా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల న్నారు. నెహ్రూ మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేశానన్నారు. తదుపరి ఫౌండేషన్ తరుపున టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ యనమల, కలెక్టర్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ, జనసేన, బిజెపి నియోజకవర్గ ఇంచార్జిలు తుమ్మలపల్లి రమేష్, ధాట్ల కృష్ణ వర్మలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట, పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి శ్రీనివాస్, టిడిపి నాయకులు ఎస్‌విఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు తదితర నాయకులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాలకు నూతన బస్ సర్వీసులు ప్రారంభం

విశాలాంధ్ర - సీతానగరం,రాజానగరం: పలు మారుమూల గ్రామాలకు రాజానగరం నియోజక వర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ చొరవతో నూతన బస్ సర్వీసులు ప్రారంభం అయ్యాయి. రాజానగరం నియోజకవర్గ పరిధిలో పలు గ్రామాలకు అర్ టి సి బస్సుల సౌకర్యం లేక పోవడం వల్ల వృద్దులు, మహిళలు, విద్యార్దులు సమస్యలు ఎదుర్కొంటున్నారు అని తెలుసుకొని ఎమ్మెల్యే బత్తుల ఒక అర్జీ రూపంలో అర్ టి సి ఉన్నత అధికారుల దృష్టికి సమస్యను తీసుకొని వెళ్ళగా అధికారులు స్పందించి శుక్రవారం సర్వీసులను ప్రారంభించారు. దీనిలో కోరుకొండ నుండి రాజమండ్రి వరకు వయా కోరుకొండ, బూరుగుపూడి, గుమ్ములూరు ,బుచ్చింపేట, ఉండేశ్వరపురం, మిర్తిపాడు మీదుగా తొర్రేడు, రాజమండ్రి వరకు నూతన బస్సు సర్వీసును జెండా ఊపి నేడు ఎమ్మెల్యే, అర్ టి సి ఉన్నత అధికారులు ప్రారంభించారు. ఈ బస్సులో ప్రజలతో ఎమ్మెల్యే బత్తుల దంపతులు ప్రయాణం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అర్ టి సి అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పు - ప్రజల సంబరాలు

విశాలాంధ్ర-చాగల్లు: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వాలు చేయవచ్చని సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు ఎమ్మార్పీఎస్ పోరాటానికి దక్కిన ఫలితమని విశ్రాంత ఎ.ఎస్.డబ్ల్యూ. తిగిరిపల్లి సాల్మన్ రాజు అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఏ.బి.సి.డి వర్గీకరణ కోసం ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నారని, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ పోరాటం చేశారన్నారు. ఈ పోరాటాలకు సుప్రీం కోర్టు తీర్పు ద్వారా ఫలితం దక్కడం చాలా సంతోషంగా ఉంది అని అన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు జొన్నకూటి సుబ్బారావు మాట్లాడుతూ మాదిగలకు ఎస్సీ వర్గీకరణ ద్వారా సామాజిక న్యాయం సాధ్యమవుతుందని, అందరికీ సమాన అవకాశాలు కల్పించాలన్న లక్ష్యం నెరవేరుతుందని కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో సుప్రీం కోర్టుకు తెలియచేసింది. వర్గీకరణకు సానుకూలంగా వచ్చిన ఈ తీర్పు ఎస్సీల్లో ఐక్యత చెక్కు చెదరకుండా చూసుకోవలసిన బాధ్యత ఎస్సీ సామాజిక వర్గ మేధావులు, విద్యావంతులపై ఉందనీ పలువురు నాయకులు పేర్కొన్నారు. అనంతరం చాగల్లు బాబు జగ్జీవన్ రావ్ విగ్రహం వద్ద కేక్ కత్తిరించి స్వీట్లు పంచారు.

పెద్దాపురంలో మద్యం, నాటు సారా ధ్వంసం

విశాలాంధ్ర - పెద్దాపురం : డివిజన్ పరిధిలోని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో పట్టుబడ్డ సుమారు 14,50,947 రూపాయల విలువ కల్గిన మద్యం బాటిళ్లు, నాటు సారాను శుక్రవారం సాయంత్రం పెద్దాపురం పోలీస్ క్వార్టర్స్ సిబ్బంది ధ్వంసం చేశారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ ఏఎస్ దొర, పెద్దాపురం డిఎస్పీ లతాకుమారి సమక్షంలో మద్యంను ధ్వంసం చేశారు. ఆయా స్టేషన్లలో పట్టుబడ్డ మద్యం, నాటు సారాను కోర్టు నిబంధనలు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ధ్వంసం చేసినట్లు డిఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సామర్లకోట సీఐ అంకబాబు, పెద్దాపురం, గండేపల్లి ఎస్ఐలు సురేష్, రామకృష్ణతో పాటు ఆయా స్టేషన్ల సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి

విశాలాంధ్ర - కాకినాడ : ఆగస్టు 15వ తేదీన కాకినాడ పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించతలపెట్టిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, ఇందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ అధికారులను ఆదేశించారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆయా శాఖల పరిధిలో అత్యుత్తమ సేవలందించిన వారి పేర్లనే అవార్డులకు సిఫార్సు చేయాలని సూచించారు. అవార్డుకు గౌరవం పెరిగే విధంగా ఉత్తమ పనితీరు కనబరిచిన వారిని మాత్రమే గుర్తించి పేర్లను ఈ నెల 10వ తేదీలోగా పంపించాలని సూచించారు. చిన్నారులు, విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేలా వేడుకలను నిర్వహించాలని, సాంస్కృతిక కార్యక్రమా లను చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. ఏటా జరుపుకునే తరహాలోనే పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రభుత్వ పథకాల శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు వంటి కార్యక్రమాలు చేపడతామని ఆ మేరకు ఆయా విభాగాల పరిధిలో ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కాకినాడ నగరంలోని పోలీస్ మైదానంలో ఆగస్టు 15వ తేదీ ఉదయం 9 గంటల నుంచి జరిగే స్వాతంత్య్ర వేడుకలకు జిల్లా ప్రజలు, స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబీకులు, ఇతర ప్రముఖులు ఆహ్వానితులేనని పేర్కొన్నారు. ఆయా శాఖల ప్రగతి నివేదికలను ఈ నెల 6వ తేదీలోగా పంపించాలని తెలిపారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు భాగస్వామ్యం అవుతారని, ఇందుకు తగిన సీటింగ్ ఏర్పాట్లు చేసుకోవాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి వర్యుల చేతుల మీదుగా పతాక ఆవిష్కరణ జరుగుతుందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో డీఎఫ్ఓ ఎస్ భరణి, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భావన, జిల్లా రెవెన్యూ అధికారి డా డి తిప్పేనాయక్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన గంటలోనే బిడ్డకు ముర్రుపాలు పట్టాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: బిడ్డ పుట్టిన గంటలోపులోనే ముర్రుపాలు పట్టించాలని దేవరపల్లి మండలం గౌరీపట్నం పిహెచ్సి వైద్యాధికారి జె. సతీష్ పేర్కొన్నారు. గౌరీపట్నం పిహెచ్సి పరిధిలో తల్లి పాల వారోత్సవాలు శుక్రవారం ప్రారంభించారు ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ ముర్రు పాలు వలన బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. అనేక పోషకాలు లభిస్తాయని తెలిపారు. తల్లిపాలు బిడ్డ శారీరక మానసిక ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. తల్లిపాలు శిశువుకు న్యుమోనియా అతి సార వ్యాధులు రాకుండా కాపాడుతుందని అన్నారు తల్లిపాలు పిల్లల మేధస్సును మెరుగుపరచడంలో ఎంతో సహకరిస్తుందని పేర్కొన్నారు. ఈ పాలు ఇవ్వడం వలన గర్భాశయ అండాశయ క్యాన్సర్ ప్రమాదం ఉండదని అన్నారు. అదనపు బరువు తగ్గటానికి సహాయ పడుతుందని అన్నారు గౌరీపట్నం అంగన్వాడి కేంద్రంలో ప్రారంభించిన ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ ఏ శ్రీకృష్ణుడు, హెచ్ ఎస్ వి అశోక్ వర్ధన్, హెచ్ వి కే జే ఎం జెస్సి, ఎమ్మెల్యే హెచ్ వి సంధ్య, శాంతి శ్రీ, ఏఎన్ఎంలు సుబ్బలక్ష్మి, ఎన్ ఎన్ వి సత్యనారాయణ కుమారి భారతి, ఆర్లమ్మ, ఆశ అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్య భారతదేశ చరిత్రలో సువర్ణ అక్షరం

విశాలాంధ్ర - సీతానగరం: పింగళి వెంకయ్య భారతదేశ చరిత్రలో ఎన్నటికీ నిలిచి పోయే సువర్ణ అక్షరం అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. చిట్టి బాబు అన్నారు. మండలంలో సీతానగరం గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ ఎస్ ఎస్, చరిత్ర విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం పింగళి వెంకయ్య 148వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా పింగళి వెంకయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దీనికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ భారతదేశ జెండా రూపకర్త పింగళి వెంకయ్య అన్నారు. కొన్ని సంవత్సరాలు కష్టపడి ఆనాటి స్వతంత్ర సమరయోధులకు నచ్చే విధంగా మువ్వన్నెల జెండా రూపకర్త పింగళి అని కొనియాడారు. ఎన్ ఎస్ ఎస్ పి ఓ డా సుధమాయి మాట్లాడుతూ రవి అస్తమించిన బ్రిటిష్ సామ్రాజ్యంలో నేటికీ భారతదేశ గౌరవాన్ని రెపరెపలాడిస్తున్న స్వతంత్ర సమరయోధుడు వెంకయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హరేరామ కృష్ణ, నాగేశ్వరరావు, షేక్ మదీనా, అలేఖ్య, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లుతదితరులు పాల్గొన్నారు.

పార్టీ శ్రేణులకు నాయకత్వం అండ

విశాలాంధ్ర - అనపర్తి : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తుందని ఏ ఒక్కరు అధైర్యపడవద్దని పార్టీ అధ్య క్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి భరోసా ఇచ్చారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్య నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వైసిపి కార్యాలయంలో నియోజకవర్గంలోని వైసీపీకి చెందిన అధికార పార్టీ బాధితులు 17 మందికి రూ.50 వేలు,మరో నలుగురికి ఒక లక్ష చొప్పున పార్టీ అధిష్టానం పంపిన చెక్కులను మాజీ ఎమ్మెల్యే సత్తి అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ అనపర్తి, బిక్కవోలు,పెదపూడి మండల కన్వీనర్లు సత్తి రామకృష్ణారెడ్డి(రాంబాబు), పోతుల ప్రసాద్ రెడ్డి, రమణ, వైస్ ఎంపీపీ పులగం బుల్లి రెడ్డి, సర్పంచ్ వారా కుమారి, సత్తి సూరారెడ్డి, సత్తి వెంకటరెడ్డి, నల్లమిల్లి మురళీమోహన్ బాలకృష్ణారెడ్డి, కొల్లేటి ఇజ్రాయిల్, అద్దంకి ముక్తేశ్వరరావు, సబ్బెళ్ళ నాగిరెడ్డి, కొండేటి భీమేష్, మల్లిడి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్నపాటి వర్షానికి మునుగుతున్న రోడ్డు

విశాలాంధ్ర - పిఠాపురం : స్థానిక 2, 3, 4 వార్డుల సమస్యల పోరాట కమిటీ ఆధ్వర్యంలో సమస్యలపై కమిటీ కన్వీనర్ కరణం విశ్వనాథం మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా వార్డు కమిటీగా అనేకసార్లు అనేకమంది అధికారులు దృష్టికి 2, 3, 4 వార్డులకు సంబంధించిన సమస్యలు తీసుకువెళ్తున్నామని ప్రభుత్వాలు మారాయి గాని ఎవరో పట్టించుకోలేదు అన్నారు. ప్రధానంగా మూడు వార్డులలో మురికి నీరు వెళ్లే మార్గం లేక చిన్నపాటి వర్షానికి రోడ్లు చెరువులను తలపిస్తున్నాయని పేర్కొన్నారు. మురికి కాలవల్లో పూడుక తీయాలని, పారిశుద్ధ్యని మెరుగుపరచాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వ అధికారులను డిమాండ్ చేశారు.